## మినీకథ



# జంగ్ ఇండియా

నాలుగేళ్ళ "జంగ్" గుడ నిండా నీళ్ళు నింపుకుని అటూ,ఇటూ బిత్తరపోయి చూస్తున్నాడు. ఎవ్వరూ ఇతన్ని పట్టించుకోవడం లేదు. అందరూ హడావుడిగా టికెట్లు తీసుకుని లోపలికి వెళ్ళిపోతున్నారు. రకరకాల మనుష్యులు నవ్వులు. కేరింతలతో తూలుకుంటూ నడిచిపోతున్నారు. రంగు రంగుల లైట్ల కాంతితో ఆ ప్రదేశమంతా రమణీయంగా ఉంది. సింహద్వారం వెనుక నగర పారిశ్రామిక ప్రదర్శనాన్ని తిలకించడానికి వచ్చిన జనంతో కిటకిట లాడుతోంది.

చాలా సేపయింది కాని. ఇంతా ఎవ్వరి దృష్టి జంగ్ మీద పడలేదు. ఇంకో క్షణంలో గట్టిగా ఏడ్చేసి, అందర్నీ తనవైపు ఆకర్షిద్దామనుకున్నాడు. అంతలోనే ఎర్రని బాడ్జ్ పెట్టుకున్న వాలంటీర్ గబగబా జంగ్ దగ్గరకొచ్చాడు. "ఎవరు బాబూ"... అంటూ అడిగాడో. లేదో ఒక్క పెట్టున మూడున్నర శృతిలో రాగం అందుకున్నాడు. గేటు దగ్గరున్న తలకాయలతో పాటు లోపలికి వెళ్ళబోతున్న తలకాయలు కూడా టకటకా ఇటువైపు తిరిగాయి.

వాలంటీర్ ఒక్కక్షణం బిత్తరపోయాడు. వెంటనే అనునయంగా జంగ్ భుజంమీద చేయివేసి. "ఏం బాబు తప్పిపోయావా?" అంటూ అడిగాడు. బుగ్గల మీద నుంచి కారుతున్న కన్నీళ్ళు తుడుచుకుంటూ, వెక్కుతూ, అవునంటూ తలూపాడు.

"అమ్మా. నాన్న" అంటూ లోపలికి చేయి చూపించాడు.

ఇంకేం ఆలస్యం చేయకుండా ఆ వాలంటీర్ జంగ్‌ని అమాంతం యెత్తుకుని లోపలికి తీసుకువెళ్ళి "అద్వర్ టైజింగ్ సెక్షన్" అన్న బోర్డున్న స్టాలులోనికి తీసుకువెళ్ళాడు.

జంగ్‌ని ఓ కుర్చీలో కూర్చోబెట్టి. పక్కనే టేబిల్ మీదున్న ప్యాకెట్‌లో నుంచి రెండు బిస్కట్లుతీసి జంగ్ చేతిలో పెడుతూ. "మీ అమ్మా, నాన్నలను ఇక్కడికి పిలుస్తాం. అందాక ఏడవకు బాబూ" అంటూ బుగ్గలు నిమిరాడు ఆ వాలంటీర్. పక్కనే మైక్ దగ్గర కూర్చున్న అమ్మాయితో ఏదో మాట్లాడి వెళ్ళిపోయాడు. ఆ అమ్మాయి జంగ్‌ని పరీక్షగాచూస్తూ ఏదో పుస్తకంలో రాసుకుంది. జంగ్ ఓ పక్క బిస్కట్లు తింటూ శబ్దం రాకుండా ఏడుస్తున్నాడు. బుగ్గలమీద కన్నీళ్ళు రాలిపోతున్నాయి. తినడంపూర్తయ్యాక మళ్ళీ బావురుమన్నాడు. ఆ అమ్మాయి గతుక్కుమన్నట్లుంది. గబగబా దగ్గరకి వచ్చి జంగ్‌ని బుజ్జగిస్తూ సగం బిస్కట్లున్న ఆ పాకెట్ అతని చేతుల్లో కుక్కింది. "ఏడవకమ్మా.. మంచివాడివి కదూ ఇంకాసేపట్లో అమ్మా వాళ్ళు వచ్చేస్తారుగా" అంటూ ఎంతో ఇదిగా బుజ్జగించింది. జంగ్ ఏడుపు ఆపి ఒక్కసారి ఆమెవైపు చూసి. మళ్ళీ వెంటనే బిస్కట్లు తినడంలో నిమగ్నుడయిపోయాడు. నిముషాలే గడిచాయి. బిస్కట్లు అయిపోయాయి. మళ్ళా జంగ్ గట్టిగా ఏడ్చాడు.

ఇందాక బయటకు వెళ్ళిపోయిన వాలంటీర్ గబగబా వచ్చాడు.

అతన్ని చూడగానే ఇంకా గట్టిగా ఏడ్చాడు.

పాపం ఆ వాలంటీర్ జంగ్‌ని ఆప్యాయతతో ఎత్తుకున్నాడు.

"ఊరుకో బాబూ" అంటూ కన్నీళ్ళు తుడుస్తూ.

"జెయింట్ వీల్ ఎక్కుతావా?" ఊరడించాడు,

'ఈలోగా వాళ్ళ అమ్మావాళ్ళు వచ్చేస్తే బావుణ్ను' అని మనసులో అనుకుంటూ.

జంగ్ కళ్ళు తళుక్ మన్నాయి. కాని బయటకు కనపడనీయకుండా మెల్లిగా తలూపాడు.

"వాళ్ళు వచ్చేవరకూ యిలా పూరుకుంటే చాలు" అనుకుంటూ ఆ వాలంటీర్ యిక ఆలస్యం చేయకుండా, మైక్ దగ్గర కూర్చున్న అమ్మాయితో ఏదో చెబుతూ, జంగ్‌ని యెత్తుకుని జెయింట్ వీల్ దగ్గరకు నడిచాడు.

జంగ్ ఓ చేత్తో ఐస్‌క్రీం తింటూ. జెయింట్ వీల్‌లో కూర్చుని ఆకాశంలో గిరగిరా తిరిగాడు. కిందకి దిగాక కిలకిలా నవ్వాడు. వాలంటీర్ సంతోషించాడు. అప్పటికే అరగంట అయిపోయింది. జంగ్ వాళ్ళ అమ్మా వాళ్ళు ఈ పాటికే వచ్చేసి ఉంటారు. అనుకుంటూ జంగ్‌ని మళ్ళీ ఎడ్వర్‌టైజింగ్ స్టాలు దగ్గరకు తీసుకువచ్చాడు వాలంటీర్. జంగ్ కోసం ఎవరూ రాలేదు.

ఆ అమ్మాయి. వాలంటీర్ ఏదో మాట్లాడుకున్నారు.

జంగ్ మాత్రం మళ్ళా సీరియస్‌గా మొహంపెట్టి, "ఇంటికి వెళ్ళిపోతాను" అన్నాడు ఏడుపు గొంతుతో. "ఇల్లు తెలుసా," అమ్మాయి అడిగింది. తలూపాడు. "మీ అమ్మా. నాన్నలు వచ్చేంతవరకూ యిక్కడే వుండు" అంది ఆమె. ఏడుపు లంకించుకోబోయాడు జంగ్. ఇద్దరూ ఏదో మాట్లాడుకున్నారు.

"సరే. మీ యిల్లు ఏ వీధిలోనో చెప్పు. నేవచ్చి దిగబెట్టేస్తాను" అన్నాడు వాలంటీర్.

"వద్దు. రిక్షా ఎక్కిస్తే వెళ్ళిపోతాను. పక్కవీధిలో ఎర్రమేడపక్కనే మాఇల్లు" జంగ్ ఏడుపు గొంతుతో అన్నాడు. 'సరే' అనుకున్నారు ఇద్దరూ.

ఓ చేత్తో ఐస్‌క్రీం తింటూ లోపలికి వస్తున్న జంగ్‌ని చూసి. "ఇంత సేపు ఎక్కడికి వెళ్ళావురా? ఆ ఐస్‌క్రీం ఎక్కడిది?" మడత కుర్చీలోనుంచి నాన్నగారు అడుగుతున్నారు ఆశ్చర్యంగా.

"ఎగ్జిబిషన్‌కు వెళ్ళాను.... జెయింట్ వీల్ కూడా ఎక్కాను. మొన్న నన్ను మీరు ఎక్కనివ్వలేదుగా...."

వంటింట్లో నుంచి వచ్చిన అనసూయ నోరు తెరుచుకొని వింటోంది జంగ్ చెబుతున్నదంతా.

—గౌరీశేఖర్

అంకితం : ప్రేమతో "జంగ్"కి